సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 21 । సెప్టెంబర్ । 2024



కా'పాడి'తేనే సిరులు

వ్యవసాయంలో నష్ట మొచ్చినా పశు సంపద రైతులకు బతుకుదెరువు ఇస్తోంది. ఇదంతా లేగదూడల సంరక్షణతోనే సాధ్యమవుతుంది. -8లో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సుండుపల్లె మండలం రాయవరం సెక్షన్ ముడుంపాడు బీట్ సమీపంలోని వానబండ ప్రదేశంలో నాలుగు ఎర్ర చందనం దుంగలు, కారును అటవీ సిబ్బంది పట్టుకున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.430	రూ.520
రెండోరకం	రూ.320	రూ.420

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 97 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు సంబేపల్లెలో ప్రజాదర్బార్

సంబేపల్లె: సంబేపల్లె మండల పరిషత్ ఆవరణలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి రవాణా, యువజనక్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ హాజరవుతారని చెప్పారు. ప్రజాదర్బారులో ప్రజల సమస్యలపై వినతులు స్వీకరిస్తారని అధికారులు తెలియజేశారు.

రేపు మంత్రి నిమ్మల రాక

బి.కొత్తకోట: జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హంద్రీ–నీవా ప్రాజెక్టు పరిశీలనలో భాగంగా ఆదివారం బి.కొత్తకోట మండలం రానున్నారు. సత్యసాయిజిల్లా పర్యటన ముగించుకుని మండలంలోని హార్సిలీహిల్స్ చేరుకుంటారు. రాత్రి బస అనంతరం సోమవారం ఉదయం కురబలకోట మండలం రిషివ్యాలీ క్రాస్ వద్ద కాలువను పరిశీలిస్తారు. మదనపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. అనంతరం పలమనేరు నుంచి మొదలయ్యే కుప్పం ఉపకాలువను పరిశీలిస్తారని ప్రాజెక్టు ఎస్ఈ రాజగోపాల్ తెలిపారు.

రైలు రెండున్నర గంటల ఆలస్యం

కలికిరి: తిరుపతి నుంచి పాకాల, పీలేరు, కలికిరి, ధర్మవరం మీదుగా సికింద్రాబాద్‌కు వెళ్లే సెవెన్‌హిల్స్(12769) వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం కలికిరి స్టేషన్‌కు రెండున్నర గంటలు ఆలస్యంగా చేరుకుంది. సాధారణంగా సాయంత్రం 5గంటలకు కలికిరి స్టేషన్‌కు రావాల్సి ఉండగా 7.35 నిముషాలకు వచ్చింది. తిరుపతిలో సాధారణ సమయం 3.35 నిముషాలకే బయలేద్దారినా పాకాల జంక్షన్‌లో రైలు ఇంజిన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో ఆలస్యమైనట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. రైలు ఆలస్యంగా రావడంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. మరోసారి ఇలా జరగకుండా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎన్‌సీసీకి 30 మంది ఎంపిక



ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

పీలేరురూరల్: స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 30 మంది విద్యార్థులు ఎన్‌సీసీకి ఎంపికయ్యారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఎన్‌సీసీ క్యాడెట్లను ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలో 29ఎ బెటాలియన్ హవల్దార్ శివలాల్, లాల్స్ నాయక్, చిరంజీవ నేతృత్వంలో ఎంపిక కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. మూడేళ్ల శిక్షణ, వివిధ రకాల రైఫిల్ షూటింగ్, విపత్తు నిర్వహణ, సామాజిక సేవ, వ్యక్తిత్వ వికాసం వంటి రంగాల్లో నైపుణ్యాలు పెంపొందిస్తారని ఆయన అన్నారు. సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులకు వివిధ ఉద్యోగాలకు ప్రత్యేక అవకాశాలు ఉంటాయన్నారు. ప్రోగ్రామ్ అధికారి వెంకటరామయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్/ చక్రాయపేట: కడప, చక్రాయపేటలోని ప్రభుత్వ ఐటీఐలలో శుక్రవారం వివిధ కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన మినీ జాబ్‌మేళాలో 60 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు జాబ్‌మేళాలను ఆయన పర్యవేక్షించారు. ఇందులో మొత్తం 149 మంది హాజరు కాగా అర్హతలు, అనుభవాన్ని బట్టి అభ్యర్థుల ఎంపిక జరిగిందన్నారు. ఎంపికై న వారు కష్టపడి పనిచేసి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

జేఎన్‌టీయూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ డ్రైవ్



ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, తదితరులు

పులివెందుల రూరల్: పులివెందుల పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాలలో శుక్రవారం బెంగళూరు ట్యాప్ అకాడమి ఆధ్వర్యంలో బీటెక్ నాల్గవ సంవత్సర విద్యార్థులకు క్యాంపస్ టు కార్పొరేట్ ఇంటర్న్‌షిప్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో 230 మంది విద్యార్థులు ఆన్‌లైన్ టెస్టుకు హాజరయ్యారు. వీరిలో పది మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఇచ్చారని కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రాధాకృష్ణ తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అరుణ కాంతి, వైస్ ప్రిన్సిపల్ సుబ్బారెడ్డి, ప్లేస్ మెంట్ ఆఫీసర్ రాధాకృష్ణలు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ట్రామా ఉంటే ధీమా!



- అత్యవసర వైద్యం ట్రామాకేర్‌తో సాధ్యం
- రోడ్డు ప్రమాద బాధితులకు ఉపశమనం
- వందపడకల ఆసుపత్రులలో ఏర్పాటైతే ప్రయోజనం



రాయచోటిలోని వంద పడకల ఆసుపత్రి భవనం

రాయచోటి: జిల్లాలోని రహదారులు రక్తమోడుతున్నాయి. నిత్యం జరుగుతున్న ప్రమాదాల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వందల సంఖ్యలో క్షతగాత్రులవుతున్నారు. మెరుగైన వైద్యం లభించిన సందర్భాల్లో బాధితులు కోలుకుని ఇళ్లకు వెళుతుండగా... ఆలస్యంగా చికిత్స అందిన ఘటనల్లో శాశ్వత అంగ వైకల్యం బారిన పడుతున్నారు. ఫలితంగా జీవితాంతం మంచానికే పరిమితమై మానసిక క్షోభ అనుభవించాల్సి వస్తోంది. ఇటువంటి హృదయ విదారక పరిస్థితులను అరికట్టేందుకు ట్రామా కేర్ కేంద్రాలు కీలకం. జిల్లా కేంద్రమైన రాయచోటితో పాటు రాజంపేట, పీలేరులో ప్రాంతీయ ఆసుపత్రులు ఉన్నాయి. వైకాపా ప్రభుత్వంలో రాయచోటి, పీలేరు పట్టణాల్లో ఒక్కో ఆసుపత్రికి రూ.23 కోట్ల వంతున ఖర్చు చేసి వంద పడకల ఆసుపత్రుల నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించే చర్యలు తీసుకుంది. ఈ ఆసుపత్రుల్లో అన్ని వసతులతో పాటు తక్షణమే వైద్య సదుపాయం అందించే ట్రామా కేర్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. అయితే ప్రభుత్వం మారడంతో ఆ ప్రయత్నాలు మరుగున పడిపోయాయి. రాష్ట్ర రవాణా శాఖ, యువజన, క్రీడల శాఖల మంత్రిగా పని చేస్తున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోని ఆసుపత్రితో పాటు రాజంపేట, పీలేరు ప్రాంతాల్లో ట్రామాకేర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు..

జిల్లా మీదుగా హైదరాబాద్–తిరుపతి, కర్నూలు – చిత్తూరు, కడప – బెంగళూరు, మదనపల్లె– బెంగుళూరు, రాయచోటి–తిరుపతి, నెల్లూరు –తుముకూరు వయా రాజంపేట, రాయచోటి. చాగలమర్రి (దువ్వూరు)–రాయచోటి వయా యర్రగుంట్ల, వేంపల్లె. అనంతపురం తిరుపతి వయా బి.కోట, మదనపల్లి, పీలేరు జాతీయ రహదారులు వెళుతున్నాయి. తిరుపతి–అనంతపురం నాలుగు లైన్ల రహదారి, కొత్తగా చాగలమర్రి (దువ్వూరు)–రాయచోటి జాతీయ రహదారి పనులు నిర్మాణంలో ఉన్నాయి. ఈ రహదారులపై నిత్యం వందలాది లారీలు, టూరెస్ట్ వాహనాలు తిరుగుతుంటాయి. అలాగే వ్యాపార కేంద్రాలు, పుణ్యక్షేత్రాలకు ఈ మార్గం ద్వారానే ప్రతి దినం వేలాది వాహనాల్లో ప్రజలు ప్రయాణాలు సాగిస్తుంటారు. అతి వేగం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం, నిద్రమత్తు, ఇతర వాహనదారుల తప్పిదాలతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పోలీసు శాఖ లెక్కల ప్రకారం జనవరి నుంచి సెప్టెంబరు 18వ తేదీ వరకు జిల్లాలో 436 ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల కారణంగా 241 మంది మృతిచెందంగా 550 మంది క్షతగాత్రులయ్యారు. ఇలా రోజూ ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదం జరగడం అందులో ఒకరిద్దరు మృత్యు వాత పడుతున్నారు. ఇలా ప్రమాదాల బారిన పడిన వ్యక్తులను ఎక్కువగా జిల్లా కేంద్రమైన రాయచోటి, మదనపల్లి, రాజంపేట, పీలేరులలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి చికిత్సలు అందిస్తుంటారు. అయితే మదనపల్లె ఆసుపత్రిలో మినహా జిల్లా కేంద్రమైన రాయచోటి, ప్రధాన పట్టణాలైన రాజంపేట, పీలేరు ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్ లేకపోవడంతో చిన్నపాటి ప్రమాదం సంభవించినా కడప, తిరుపతి, వేలూరు, బెంగళూరు ఆసుపత్రులకు పరుగులు తీయాల్సి వస్తోంది.

అంతదూరం వెళ్లేలోగా ప్రాణాలు గాల్లోకి..

ప్రమాదం జరిగిన తర్వాత స్థానికుల నుంచి వైద్య సిబ్బందికి సమాచారం వచ్చి వారిని మదనపల్లె, కడప, తిరుపతి, వేలూరు, బెంగుళూరు ప్రాంతాలలోని ఆసుపత్రులకు తీసుకెళ్లడానికి సమయం పడుతోంది. ఈలోగా అనేకమంది ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఆగస్టు నెల నుంచి ఇప్పటి వరకు కడప ఘాట్ రోడ్డు, రామాపురం మండల కేంద్రం సమీపాల్లోనూ, మదనపల్లె–పీలేరు, ఒంటిమిట్ట–రాజంపేట, రాజంపేట–కోడూరు మార్గాల్లో జరిగిన ప్రమాదాల్లో ఘటనాస్థలిలోనే 30 మందికి పైగా మృత్యువాత పడగా వంద మంది గాయపడ్డారు. క్షతగాత్రులను సంఘటన స్థలానికి దగ్గరలో అంటే 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న కడప ఆసుపత్రికి, వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతి ఆసుపత్రులకు తరలించారు. తర్వాత వేలూరు, తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు. స్వల్ప గాయాల బారిన పడిన వారికి మాత్రమే స్థానికంగా చికిత్స అందిస్తున్నారు. అదే ట్రామాకేర్ కేంద్రం ఉంటే ఈ దుస్థితి తలెత్తేది కాదు. కావున జాతీయ రహదారులు అధికంగా ఉన్న రాయచోటి. రాజంపేట పీలేరులలో దీని అవసరం అధికంగా ఉంది.

2019 జనవరి నుంచి నేటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలు..

ప్రమాదాలు : 436

చనిపోయిన వారు : 241

క్షతగాత్రులు : 550 మంది



అందుబాటులో నిపుణులు... పరికరాలు..



ట్రామా కేర్ కేంద్రంలో అధునాతన పరికరాలు, వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారు. ఒక న్యూరో సర్జన్, ఇద్దరు రేడియాలజిస్టులు, ముగ్గురు ఆర్థోపెడిక్ వైద్యులు, ఇద్దరు జనరల్ సర్జన్లు, 8 మంది మెడికల్ అధికారులు, 40 మంది స్టాఫ్‌నర్సులు, 16 మంది నర్సింగ్ సహాయకులు, ఐదుగురు ఓటీ టెక్నీషియన్లు, నలుగురు రేడియోగ్రాఫర్లు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, 15 మంది మల్టీ టాస్క్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. ఐసీయూ పడకలు 10, జనరల్ ట్రామా పడకలు 10, రెండు ఆపరేషన్ థియేటర్లు, 3డీ అల్ట్రాసోనోగ్రఫీ మిషన్, 500 ఎంఏ ఎక్స్‌రే, 100 ఎంఏ ఎక్స్‌రే వంటి పరికరాలు ఏర్పాటు చేస్తారు. తద్వారా గాయపడిన వ్యక్తులకు తక్షణమే చికిత్స అందిస్తారు. సత్వర వైద్యంతో మరణాలు, అంగ వైకల్యాలను తగ్గించడమే ట్రామా కేర్ కేంద్రాల లక్ష్యం. రోడ్డు ప్రమాదాలతో పాటు గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన వారికి, గర్భిణులు, చిన్నారులకు ఇక్కడ వైద్యం అందించవచ్చు.

నాలుగు ట్రామా కేర్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు



జిల్లాలో నాలుగు కేర్ ట్రామా కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.జిల్లాలో జాతీయ రహదారులు అధికంగా ఉండటంతో ప్రమాదాల బారిన పడి ఆసుపత్రులకు వస్తున్నారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందివాలంటే ట్రామాకేర్ కేంద్రం ప్రధానంగా ఉండాలి. అందుకోసం రాయచోటి, రాజంపేట, పీలేరు, తంబళ్లపల్లి ఆసుపత్రుల్లో వీటిని ఏర్పాటు చేయాలని నివేదికను అందజేశాం. – డేవిడ్ సుకుమార్, సూపరింటెండెంట్

సెల్ఫీ రాజా.. మోగించు బాజా..





2018 నుంచి తాళం వేసివున్న బి.కొత్తకోట షాదీమహల్ (ఇన్‌సెట్) పాదయాత్ర సందర్భంగా షాదీమహల్ వద్ద లోకేష్ సెల్ఫీ (ఫైల్)

- లోకేష్ గారూ షాదీమహల్‌ను బాగుపర్చండి!
- సౌకర్యాలు కల్పించకుండానే ప్రారంభించిన నాటి ఎమ్మెల్యే శంకర్
- వినియోగంలోకి తేవాలని ముస్లింల డిమాండ్

బి.కొత్తకోట: యువగళం పాదయాత్ర సందర్భంగా 2023 మార్చి 15న బి.కొత్తకోట మీదుగా పెద్దతిప్ప సముద్రం మండలంలోకి వెళ్తూ..ఆలేరువాగు ఒడ్డున నిర్మించిన బి.కొత్తకోట షాదీమహల్ వద్ద ఆగిన ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సెల్ఫీ తీసుకున్నారు. దీనిని టీడీపీ ప్రభుత్వంలో రూ.50 లక్షలతో నిర్మించగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తాళంతో పాటు బ్లూ, ఆకుపచ్చ రంగులు వేయించిందని ట్విట్టర్‌లో పోస్టు పెట్టి ఆరోపణలు చేశారు. తాళం వేసిన పాపం నూటికి నూరుపాళ్లు టీడీపీ ప్రభుత్వానిదే. దీనిని ఎప్పుడు, ఎవరి హయాంలో నిర్మించారో స్థానికులకు తెలియంది కాదు. ఈ విషయంలో వాస్తవాలు తెలుసుకోకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నిందలు వేసిన లోకేష్ ఇప్పుడు మంత్రిగా ఉన్నారు. వారి హయాంలో నిర్మించి నిరుపయోగం చేసిన షాదీమహల్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ముస్లింలు డిమాండ్ చేస్తున్నారు.

సౌకర్యాలు విస్మరించి విమర్శలు

షాదీమహల్‌లో వివాహాలు, ఇతరా శుభకార్యాలు జరుపుకునేందుకు అవసరమైన సౌకర్యాలను గత టీడీపీ ప్రభుత్వం కల్పించలేదు. ప్రధానంగా తాగునీటి వసతి లేదు. బోరువేయించాలని టీడీపీ ముస్లిం నాయకులు ప్రారంభోత్సవ సభలోనే విన్నవించినా పట్టించుకోలేదు. రూ.50లక్షలతో నిర్మించిన భవనానికి కనీసం విద్యుత్ కనెక్షన్ కూడా ఇవ్వలేకపోయారు. భవనం నిర్మించి శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలాఫలకాలు వేసి చేతులు దులుపుకున్నారు. 2018 అగస్టు 16న ప్రారంభించిన రోజు షాదీమహల్ తెరచుకుంది. అయితే మరుసటిరోజు నుంచే దీనికి తాళం వేశారు. అప్పుడు వేసిన తాళమే ఇప్పటికీ అలాగే ఉంది. షాదీమహల్ వ్యవహారంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఏనాడూ జోక్యం చేసుకోలేదు. వైఎస్సార్‌సీపీ నాయకుల జోక్యంకాని, ప్రమేయం కానీ లేదు. ముస్లింల కోసం షాదీమహల్ నిర్మించినా 2019లో టీడీపీ అధికారం కోల్పోయేదాకా పట్టించుకోలేదు. ఈ తప్పులన్నీ గత టీడీపీ ప్రభుత్వంలో జరిగి తాళం పడితే దానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై లోకేష్ ఆరోపణలు చేశారు. పాదయాత్రలో షాదీమహల్ వద్ద సెల్ఫీ తీసుకుని తాళం వేశారని ఆరోపించిన లోకేష్ దీనిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ముస్లింలు కోరుతున్నారు.

తాళం పాపం టీడీపీదే

గత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా పనిచేసిన జి.శంకర్‌యాదవ్ అధిక జనాభా కలిగిన ముస్లింలు శుభకార్యాలు నిర్వహించుకోవడం కోసం ఎస్‌డీఎఫ్ నిధుల కింద షాదీమహల్ నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేయించారు. 2016 జూలై 7న రంజాన్ పండుగ నమాజ్ అనంతరం శిలాఫలకాన్ని స్థానిక ఈద్గా వద్ద ఆవిష్కరించారు. నిర్మాణం పూర్తవడంతో 2018 అగస్టు 16న ఎమ్మెల్యే శంకర్ షాదీమహల్‌ను ప్రారంభించారు. తర్వాత నిర్వహించిన సభకు ఎమ్మెల్యే శంకర్, మండలి విప్ షరీఫ్, మాజీ కేంద్రమంత్రి సాయిప్రతాప్ హజరయ్యారు. ఈ సభలోనే టీడీపీ రాష్ట్ర నాయకురాలు పర్వీన్‌తాజ్ షాదీమహల్‌కు సౌకర్యాలు కల్పించాలని కోరారు. అయినా పట్టించుకోలేదు.

వసతి గృహాల్లోని పిల్లలను సొంత బిడ్డల్లా భావించాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



వసతి గృహాలపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి: ప్రభుత్వ వసతి గృహాలకు నిరుపేద పిల్లలు చదువుకోవడానికి వస్తారు. వారందరినీ సొంత బిడ్డల్లా భావించి బాగా చదువుకునేలా ప్రోత్సహించడమే సంక్షేమశాఖ హాస్టల్ వార్డెన్ల బాధ్యత అని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని వసతి గృహాల నిర్వహణపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కేజీబీవీ హాస్టల్స్, పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని, ప్రభుత్వం వసతి గృహాల నిర్వహణకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. మరుగుదొడ్లు పనిచేయడం లేదని, తాగునీటికి సింటెక్స్ ట్యాంకులు లేవని, చదువుకోవడానికి విద్యుత్ బల్బులు లేవని ఇలా అనేక అంశాలకు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. మీ బాధ్యతలను గుర్తించి హాస్టళ్ల నిర్వహణ పటిష్టంగా ఉండేలా చూడాలన్నారు. బాధ్యతలపట్ల నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. 240 మంది బాలికలు ఉన్న వీరబల్లి కేజీబీవీ వసతి గృహాన్ని సందర్శించగా అక్కడ సగం మరుగుదొడ్లు ఉపయోగంలో లేవని, పైపులన్నీ బ్లాక్ అయి ఉన్నాయని, ఎందుకు సమస్య వచ్చిందని ఆరా తీస్తే పైపుల్లో శానిటరీ నాప్కిన్స్ అడ్డుపడి ఉన్నట్లు తెలిసిందన్నారు. ఇది కేవలం పర్యవేక్షణ, నిర్వహణ లోపంగా తెలుస్తోందన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన రుచి, శుభ్రత కల్గిన ఆహారం అందించాలన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. తనతో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఇద్దరు సబ్ కలెక్టర్‌లు, ఆర్డీఓలు ప్రతివారం ఒక హాస్టల్‌ను, పాఠశాలలను సందర్శించనున్నట్లు తెలిపారు. వసతి గృహాలను సందర్శించాలని జిల్లా అధికారులు, తహసీల్దార్లకు కూడా సూచిస్తామన్నారు కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖాధికారులు సందప్ప, రామసుబ్బయ్య, తేజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భవితకు నవోదయం



మదనపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయం



కంప్యూటర్ తరగతి గదిలో విద్యార్థులు

- ఆరో తరగతిలో 80 సీట్లకు దరఖాస్తుల స్వీకరణ
- ఈనెల 23వతేదీ వరకు గడువు
- జనవరి 18న ప్రవేశ పరీక్ష

మదనపల్లె సిటీ: విద్యార్థుల భవిష్యత్ ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు నవోదయ విద్యాలయ సమితి కృషి చేస్తోంది. క్రమశిక్షణకు మారుపేరుగా మారిన ఈ విద్యాలయంలో సీటు పొందిన వాళ్లు అన్ని రంగాల్లో రాణించేలా.. ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందేలా ప్రత్యేక తీర్చిదునిస్తుంది. ఒక్కసారి ఇందులో చేరితే పిల్లల భవిష్యత్తుకు ఢోకా ఉండదని తల్లిదండ్రులు భావిస్తారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. జిల్లాలో మదనపల్లె సమీపంలోని వలసపల్లిలో, రాజంపేటలో నవోదయ విద్యాలయాలు ఉన్నాయి. ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. దరఖాస్తు చేసుకోవడానికి గడువు కూడా పెంచారు. 80 సీట్లకు గాను నవోదయ విద్యాలయ సమితి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తుండగా సెప్టెంబర్ 23వ తేదీతో గడువు ముగుస్తుంది. కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. సీటు సాధించిన బాల,బాలికలు 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యనభ్యసిస్తారు. జనవరి 18న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

అర్హతలు ఇవీ..

- 2024–25 విద్యా సంవత్సరంలో మదనపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అయి ఉండాలి. విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చదువుతూ ఉండాలి.
- రాజంపేట జవహర్ నవోదయ విద్యాలయంలో ఉమ్మడి కడప జిల్లా అయి ఉండాలి. విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరంలో ఉమ్మడి కడప జిల్లాలో చదువుతూ ఉండాలి.
- 3,4 తరగతులు చదివిన పాఠశాలలు, 5 వ తరగతి చదువుతున్న పాఠశాల ప్రభుత్వం, ఎయిడెడ్, గుర్తింపు పొందినవిగా ఉండాలి.
- 01–05–2013 నుంచి 31–7–2015 మధ్య కాలంలో జన్మించి ఉండాలి.


గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అవకాశం

- మొత్తం 80 సీట్లకు గాను 75 శాతం సీట్లను గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కేటాయిస్తారు.
- ఎస్సీ,ఎస్టీ ఓబీసీ, దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్ ఉంటుంది.
- బాలికలకు మొత్తం సీట్లలో 1/3 వంతు సీట్లు కేటాయిస్తారు.

చదువుతో పాటు అన్నీ...

ఇక్కడ సీటు సాధించిన విద్యార్థులకు కేవలం చదువుకు మాత్రమే పరిమితం చేయకుండా అన్ని రంగాల్లో రాణించేలా తర్ఫీదు అందిస్తారు. కో ఎడ్యుకేషన్ ఉండగా బాల,బాలికలకు ప్రత్యేకంగా వసతి సౌకర్యం ఉంది. క్రీడలు, ఎన్‌సీసీ , ఎన్ఎస్ఎస్,సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు నూతన సాంకేతిక అంశాలను జోడించి విద్యాబోధన చేపడతారు.

నాణ్యమైన విద్య, మెరుగైన వసతి



జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతి, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నాం. దరఖాస్తుల స్వీకరణ జరుగుతుంది. తల్లిదండ్రులు మొబైల్, సమీప నెట్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. –బి.గోవిందరావు, ప్రిన్సిపాల్, నవోదయ విద్యాలయ, మదనపల్లె

క్లుప్తంగా

మైనర్ బాలిక అదృశ్యం

మదనపల్లె : పట్టణంలోని చీకలగుట్ట విజయనగర్ కాలనీకి చెందిన ఓ మైనర్ బాలిక(14) ఈ నెల 18 సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. పలుచోట్ల గాలించిన కుటుంబ సభ్యులు ఆచూకీ తెలియకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ రహీముల్లా తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



నారాయణ మృత దేహం వద్ద విలపిస్తున్న బంధువులు

చిన్నమండెం : మండలంలోని జల్లావాండ్లపల్లె క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సుంకర నారాయణ(55) మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు.. జల్లావాండ్లపల్లెకు చెందిన సుంకర నారాయణ ఆవుల మేత కోసం గడ్డి కోసేందుకు దిన్నెమీదపల్లెకు వస్తున్నారు. దారి మధ్యలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో నారాయణ అక్కడికక్కడే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువు ఆక్రమణపై ఫిర్యాదు

కేవీపల్లె : మండలంలోని గుర్రెడ్డిగారిపల్లె సమీపంలో చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికుడు జి.వెంకటేశ్వర్ కోరారు. మండల తహసీల్దారు క్రాంతికుమార్‌నువారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వే నెంబర్ 714/1లో కొంత భాగం గ్రామానికి చెందిన ఎస్.రెడ్డి బాషా ఆక్రమించుకుని వ్యవసాయం చేస్తున్నాడన్నారు. అదే సర్వే నెంబర్‌లో గ్రామానికి చెందిన సంజీవరెడ్డి చెరువు స్థలాన్ని పక్కనే ఉన్న తన పొలంలో కలుపుకుని కంచె వేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారులు తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి




మృతి చెందిన లాస్య

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని న్యూ కృష్ణానగర్‌లో నివాసముంటున్న మహేష్ ఇంట్లో వంటలు చేస్తుండగా అక్కడే ఆడుకుంటున్న ఆయన కుమార్తె కొక్కంటి లాస్య(4) వంటల గిన్నెలో పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన తిరుపతికి, ఆపై వేలూరు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బాలిక మృతి చెందారు. ఈ మేరకు పోలీసులు విచారిస్తున్నారు.

25 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వల్లూరు : మండలంలోని పాపాఘ్ని నది నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 25 ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. నది నుంచి భారీగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్‌బీ అధికారులు దాడులు నిర్వహించారు. పోలీసుల రాకను గమనించిన కొందరు ట్రాక్టర్ల డ్రైవర్లు ఇసుకను లోడ్ చేసుకున్న ట్రాక్టర్లను వదిలి పరారయ్యారు. పట్టుకున్న ట్రాక్టర్లను వల్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సంజీవరాయుడు తెలిపారు.

కాపాడితేనే సిరులు



- లేగ దూడల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం
- పోషణలోనూ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే

ప్రస్తుతం పాడి పరిశ్రమ సిరులు కురిపిస్తోంది. ఎక్కువమంది రైతులు పాడి పశువులపై ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయంలో నష్ట మొచ్చినా, కరవు కాటకాలు సంభవించినా పశు సంపద నమ్మకంగా బతుకుదెరువు ఇస్తోంది. ఇదంతా లేగదూడల సంరక్షణతోనే సాధ్యమవుతుంది. పశువులు చూడితో ఉన్నప్పటి నుంచి దూడ పుట్టే వరకు పోషణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే మేలుజాతి పశువులు తయారవుతాయి.



లేగదూడలు

సిద్దవటం : పరిశుభ్రమైన వాతావరణంలో లేగ దూడల దూడ పోషణ చాలా ముఖ్యం. దూడ పుట్టిన వెంటనే అరగంట లోపు తల్లి పాలు(జున్ను) తాగిస్తే అత్యధికంగానూ, ఎనిమిది గంటల తర్వాత తాగిస్తే 40 శాతం, 20 గంటల తర్వాత 12 శాతం, 36 గంటల తరువాత పది శాతం పీల్చుకునే శక్తి వస్తుంది. జున్ను పాలు తాగలేక పోతే పాలు పితికి బాటిల్ ద్వారా సరి సమాన పద్ధతిలో తాగించాలి. జున్ను పాలు తక్కువ అయితే నీరసంగా ఉంటాయి. ఎక్కువగా తాగిస్తే విరేచనాలు అవుతాయి. కాబట్టి జాగ్రత్తల పాటిస్తూ దూడలకు వాటి శరీర బరువులో పది శాతం చొప్పున (సుమారు 3 లీటర్ల వరకు) రోజుకు మూడు సార్లు ఆరు గంటల వ్యవధిలో తాగించాలి. మూడు లీటర్లకంటే ఎక్కువ పాల దిగుబడి ఉంటే దూడకు 3 లీటర్లు పోగా మిగిలిన వాటిని పొదుగు నుంచి పూర్తిగా పితకాలి. దూడలకు వాటి శరీర బరువులో పదోవంతు పాలను రోజుకు రెండు పూటలా నెల రోజులపాటు అందించాలి. అవి మట్టి నాకకుండా చిక్కం కట్టాలి.

లేగ దూడ సంరక్షణ

లేగదూడ పుట్టిన తర్వాత బొడ్డు నుంచి నాలుగు అంగుళాలు వదలి దారంతో ముడివేసి కింద బొడ్డు కత్తిరించి టించర్, అయోడిన్ పూయాలి. మొదట 15 రోజులపాటు రోజూ రెండు నుంచి 2.50 లీటర్లు, 16 నుంచి 3 రోజుల వరకూ రెండు లీటర్ల పాలు, వంద గ్రాముల దూడల దాణా+ ఎండుగడ్డి+పచ్చి గడ్డి ఇవ్వాలి. 30 రోజుల నుంచి పాలు మాన్పించి అనంతరం గడ్డి, దాణా మోతాదు పెంచాలి. మొక్కజొన్న విత్తనాలు, వేరుశనగ , పొద్దుతిరుగుడు, నువ్వుల చెక్క, తవుడు, లవణ మిశ్రమం, ఉప్పుతో దూడల కోసం దాణా తయారు చేసి అందిస్తే ఖర్చు తగ్గుతుంది. సాధారణంగా వాటి శరీర బరువులో పదో వంతు నీరు ప్రతి రోజూ అవసరం . అలాగే రెండో వారం నుంచి పరిశుభ్రమైన నీటిని తాగించాలి. పాలు పితికే ముందు చేపు కోసం, పాలు పితికిన తరువాత చివరి పాలను దూడలకు వదులరాదు. ఒక పక్క పాలు పితుకుతూనే మరో పక్క దూడ తాగేలా చూడాలి.

మందుల వాడకం

దూడ పుట్టిన ఏడు నుంచి 21 రోజులు, ఆపైన నెల కోసారి అంతర పరాన్న జీవులు లేకుండా నట్టల నివారణ మందు తాగించాలి. పుట్టిన వారం నుంచి వారానికోసారి విటమిన్ల మిశ్రమాన్ని అందించాలి. పుట్టిన 2, 3 రోజుల్లో ధనుర్వాతం రాకుండా టెట్‌వ్యాక్స్ టీకా వేయించాలి. నాలుగు నెలల వయస్సు నుంచి ఒక సంవత్సరం వరకు గాలికుంటు, గొంతువాపు. జబ్బ వాపు టీకాలు సరైన సమయంలో వేయాలి.

లేగదూడలను జాగ్రత్తగా పెంచుకోవాలి



లేగ దూడలను పాడి రైతులు జాగ్రత్తగా పెంచుకోవాలి. దూడ పుట్టిన అరగంటలోపే జున్ను పాలు తాగిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. అవి మట్టి తినకుండా చూసుకోవాలి. లేదంటే బ్యాక్టీరియా క్రిములు చేరి వ్యాధులు సంభవిస్తాయి. 15 రోజులకు నట్టల నివారణా మందులు తాపాలి. దూడ పశువు యొక్క పొదుగు తాకుతుంటే పాలు చేపుకు వస్తాయి. – డాక్టర్ ఎం.శివశంకర్, పశు వైద్యాధికారి, భాకరాపేట

వంద రోజుల పాలనలో అభివృద్ధి శూన్యం

- చంద్రబాబు అసమర్థత కప్పిపుచ్చుకొనేందుకే జగన్‌మోహన్‌రెడ్డిపై విష ప్రచారం
- మీడియా సమావేశంలో వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి

రాయచోటి : వంద రోజుల పాలనలో అభివృద్ధి శూన్యమని, దీనిపై ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతో సీఎం చంద్రబాబు తిరుమల ప్రసాదం పేరుతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై విష ప్రచారానికి తెర తీశారని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. రాయచోటిలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ నుంచి ప్రజల దృష్టిని మరలించడానికి తిరుమల లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యిలో అవశేషాలు ఉన్నాయంటూ బురదజల్లే రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఒకవైపు వరదలు, ఇంకో వైపు వర్షాభావంతో రాష్ట్రం అతలాకుతలమైందని, ఈ పరిస్థితులను ఎదుర్కోలేక ఇలాంటి దుష్ప్రచారాలకు ఒడిగడుతున్నారని ఆరోపించారు. గడచిన ఐదేళ్లలో తిరుమలలో అపచారం జరిగిందనే విషయాన్ని మీ మీడియా సంస్థలు ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. వైసీపీ నాయకులను భయభ్రాంతులకు గురిచేసి ఈ సమాజంలో దోషులుగా నిలబెట్టాలనే కుట్ర జరుగుతోందన్నారు. కోట్లాది వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలను చంద్రబాబు తన రాజకీయ స్వార్థం కోసం దెబ్బతీస్తున్నారని, వెంటనే హిందువులకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విష ప్రచారంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ న్యాయపోరాటం చేస్తుందని హెచ్చరించారు.

వంద రోజుల పాలన కార్యక్రమానికి స్పందన కరవు

బ్రహ్మంగారిమఠం : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులైన సందర్భంగా శుక్రవారం నుంచి ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపీడీఓ వెంగమునిరెడ్డి ఆధ్వర్యంలో డి.నేలటూరు పంచాయతీలో గ్రామసభ ఏర్పాటుచేశారు. ప్రజలు సమావేశానికి రాకపోగా కనీసం ఆ పార్టీ కార్యకర్తలు హాజరు కాకపోవడంతో ఎంపీడీఓ విస్మయం చెందారు. ఇది మంచి ప్రభుత్వంలో ఏమి సాధించారంటూ స్థానికులు చర్చించుకున్నారు. ఇంతవరకు ఉచిత బస్సు సౌకర్యం, విద్యా దీవెన, మహిళలకు రూ.1500 ఏమీ ఇవ్వలేదని మహిళలు ఆరోపించారు. కూటమి నాయకులలో టీడీపీకి చెందిన మండల పార్టీ అధ్యక్షుడు మాత్రమే గ్రామ సభలో పాల్గొన్నారు. ఎంపీడీఓ మాత్రం ప్రభుత్వం పంపిన కరపత్రం చదివి వెళ్లిపోయాడు.

ప్రియుడి కోసం నిరసన

పోలీస్ స్టేషన్ ఎదుట ప్రియురాలు బైఠాయింపు



ప్రేమికుడు వెంకటసాయి



ప్రేమికురాలికి అండగా నిలిచిన గ్రామ మహిళలు

పెనగలూరు : తన ప్రియుడి కోసం ఓ ప్రేమికురాలు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. స్థానికుల వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం ఈటమాపురం గ్రామానికి చెందిన బైరిరాజు వెంకటసాయి, లావణ్య నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల లావణ్యను కాదని.. మరో అమ్మాయిని వెంకటసాయి వివాహం చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. దీంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ గ్రామస్థులతో కలిసి ఎస్‌ఐ రవి ప్రకాష్‌రెడ్డిని లావణ్య కోరారు. అనంతరం వారిని పిలిపించి మాట్లాడగా.. లావణ్యతో వివాహానికి వెంకట సాయి వెనుకంజ వేశారు. స్టేషన్ గేటు బయట మండుటెండలో గ్రామస్థులతో కలిసి లావణ్య బైఠాయించి నిరసనకు దిగారు. చావైనా, బ్రతుకైనా వెంకటసాయితోనేనని భీష్మించారు. అనంతరం ఎస్సై ఇరువురు ప్రేమికుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చినా ప్రయోజనం కనిపించక పోవడంతో రాజంపేట రూరల్ సీఐ వద్దకు వెళ్లాలని సూచించారు. వెంకటసాయిపై కేసు నమోదు చేయవద్దు.. తనతో వివాహం చేయించాలని లావణ్య విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణంగా ప్రేమించిన వెంకటసాయి దక్కకుంటే విషంతాగి చనిపోతానని స్టేషన్ ఎదుట హల్‌చల్ చేశారు. ఎస్‌ఐ వివరణ ఇస్తూ నాలుగేళ్లుగా వెంకటసాయిని ప్రేమిస్తున్నానని లావణ్య తెలపడంతో ఇద్దరినీ పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చానని తెలిపారు. లావణ్య రాత పూర్వకంగా అర్జీ ఇస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

నాలుగు ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం



అటవీ అధికారుల అదుపులో నిందితుడు, దుంగలు

సుండుపల్లె : నాలుగు ఎర్ర చందనం దుంగలు, కారును అటవీ సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి వై.చంద్రశేఖర్ రెడ్డి వివరాల మేరకు.. మండలంలోని రాయవరం సెక్షన్ ముడుంపాడు బీట్ సమీపంలోని వానబండ ప్రదేశంలో తనిఖీలు చేస్తున్నారు. ఏపీ02ఏజె8126 నెంబర్ కారు డ్రైవర్ ఆపకుండా అతివేగంగా వెళ్లడంతో అటవీ సిబ్బంది వెంబడించి పట్టుకున్నారు. కారుతోపాటు, రూ.4 లక్షల విలువగల నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. కారులో ఒకరు పరారవగా, తమిళనాడు రాష్ట్రం, తిరుపత్తూరుకు చెందిన కె శివకుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయవరం డీవైఆర్‌ఓ రమేష్‌బాబు, ముడుంపాడు బీట్ ఎఫ్‌బీఓ అంజన, స్వాతి, లక్ష్మీ ప్రసన్న, లీలాహరి, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా ఇసుక ఇవ్వాలని రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న బి.కొత్తకోట వాసులు

బి.కొత్తకోట : భవన నిర్మాణాలకు ఉచితంగా ఇసుక ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బి.కొత్తకోటలో ఏఐటీయూసీ నాయకులు, స్థానికులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇసుక తరలింపునకు అనుమతిలేక నియోజకవర్గంలో గృహ నిర్మాణాలు నిలిచిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలలో నాలుగో విడత అడ్మిషన్లు

వైవీయూ : వైఎస్‌ఆర్ కడప జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో మిగిలిన సీట్లకు నాలుగో విడతగా ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ ప్రిన్సిపల్ ఎం.జ్ఞానకుమార్ తెలిపారు. పది ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 26వ తేదీ తుదిగడువు అన్నారు. ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు ఈ నెల 28న, ప్రైవేట్ ఐటీఐలో ప్రవేశాలకు ఈ నెల 30న కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సమీపంలోని ఐటీఐల వద్దకు వెళ్లి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

లారీలు నిలిపి నగదు దోపిడీ

ముద్దనూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామ సమీపంలో రెండు లారీలను నిలిపి డ్రైవర్ల వద్ద నగదు, సెల్‌ఫోన్ దోచుకున్నారు. బాధితుల సమాచారం మేరకు తమిళనాడుకు చెందిన రెండు లారీలు శుక్రవారం తెల్లవారుజామున వేర్వేరు సమయాల్లో ముద్దనూరు–కడప రహదారిలో వెళ్తున్నాయి. కొత్తపల్లె సమీపంలో దొంగలు లారీలను నిలిపివేశారు. ఓ లారీలోని వ్యక్తుల నుంచి రూ.15 వేలు, మరో లారీలో ఉన్న వారి నుంచి రూ.5 వేలు, రెండు సెల్‌ఫోన్లు లాక్కెళ్లారని బాధితులు తెలిపారు.

తిరుపతి–షోలాపూర్ రైలు గడువు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప మీదుగా షోలాపూర్–తిరుపతి–షోలాపూర్ (01437/01438) మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలు గడువును డిసెంబరు 27వ తేదీ వరకు పొడిగించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. షోలాపూర్–తిరుపతి (01437) రైలును ఈ నెల 26వ తేదీ వరకు నడపాల్సి ఉండగా, ప్రయాణీకుల రద్దీ మేరకు డిసెంబరు 26వ తేదీ వరకు పొడిగించారన్నారు. అలాగే తిరుపతి–షోలాపూర్ (04138) నడిచే రైలును డిసెంబరు 27వ తేదీ వరకు పొడిగించారు. ఈ రైళ్లకు కడప, ఎర్రగుంట్లలో స్టాపింగ్ కల్పించారని కోరారు.

ఏచూరి మరణం పార్టీకి తీరని లోటు



మాట్లాడుతున్న వెంకటేశ్

రాయచోటి అర్బన్ : పేదల హక్కుల కోసం జీవితాంతం పోరాటం చేసిన సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటు అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని ఎన్‌జీఓ సభా భవనంలో ఏచూరి సీతారం మృతికి సంతాప సభ నిర్వహించారు. వెంకటేశ్ మాట్లాడుతూ ఎర్రజెండా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లి దేశంలోని అన్ని రాష్ట్రాలకు విస్తరింప చేసిసిన ఘనత సీతారాం ఏచూరికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ సీతారాంఏచూరి తనకున్న పట్టుదల, కార్యదక్షతతో గొప్ప మేధావిగా పేరొందారన్నారు. ప్రజల కోసం నిరంతరం పోరాటాలుచేసే కమ్యూనిస్టులకు ఎల్లవేళలా తన అండదండలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులుతోపాటు నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యుల ఆకస్మిక తనిఖీ



వీరబల్లె: గ్రామస్థుల సమస్యలు వింటున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని గిరిజన సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాలను రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు ఒ.సోమశంకర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం విద్యార్థులకు అన్ని వసతులు, విద్య అందించాలన్నారు. విద్యార్థినుల చేత నిర్లక్ష్య వైఖరితో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని చెప్పారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. తనిఖీ నివేదికను ప్రభుత్వానికి పంపుతామన్నారు. జెడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీటీసీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

షికారుపాలెంలో..

వీరబల్లె : మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీలోని ఎస్టీ కాలనీ, షికారుపాలెంలో శుక్రవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ పర్యటించారు. ఇందులో భాగంగా అక్కడ ప్రజలకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణి, రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్‌ఐ మోహన్ నాయక్, ఎస్టీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథనాయక్, అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



గుణశేఖర్ (ఫైల్)

మదనపల్లె : కర్ణాటకలోని రాయల్పాడు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం పాలయ్యారు. ఎస్‌ఐ యోగేష్ కుమార్ వివరాల మేరకు.. గురువారం రాత్రి ద్విచక్ర వాహనంలో ఓ వ్యక్తి కర్ణాటక నుంచి మదనపల్లెకు కర్ణాటక మద్యం తరలిస్తున్నారు. మార్గమధ్యంలో రాయల్పాడు వద్ద ఓ ప్రైవేట్ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో మృతుడి తల, మొండెం వేరు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. అతడి ద్విచక్ర వాహన నెంబర్ ఆధారంగా పోలీసులు విచారించగా మదనపల్లి మండలం చీకలబైలుకు చెందిన గుర్రప్ప కుమారుడు గుణశేఖర్(27) అని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీనివాసపురం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పోలీసులపై దాడికి యత్నం

మదనపల్లె : పోలీసులతో అసభ్యంగా మాట్లాడి వారిపై దాడికి యత్నించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై రహీముల్లా తెలిపారు. గురువారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్టాండులో పట్టణంలోని వడ్డెపల్లెకు చెందిన మహమ్మద్ ఇసాక్, నెమలినగర్కు చెందిన గిరిధర్‌రెడ్డి మద్యం తాగి కేకలు వేస్తూ ప్రయాణికులకు ఇబ్బంది కలిగించారు. స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై రవికుమార్, హెడ్ కానిస్టేబుల్ పెంచలయ్య వారిని అడ్డుకున్నారు. అయితే ఎస్సై హెడ్‌కానిస్టేబుల్ను అసభ్యకరంగా మాట్లాడి, అతడిపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. దీంతో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని టూటౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. సీఐ రామచంద్ర ఆదేశాల మేరకు విధులకు ఆటంకం కలిగించిన యువకులు మహమ్మద్ ఇషాక్, గిరిధర్ రెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : అనారోగ్యంతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. బసినికొండ పంచాయతీ దిగువకంపల్లె నిమ్మనపల్లి రోడ్డులో నివాసం ఉన్న రెడ్డి(25) పెయింటర్గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యం బారిన పడి పలు ఆసుపత్రులలో చికిత్స పొందారు. శుక్రవారం మరోసారి ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో మనస్తాపం చెంది, ఇంటి వద్ద గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగ వైద్యులు చికిత్స అందించినా, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఏడు రోజుల జైలు శిక్ష

కడప అర్బన్ : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన గోటూరు గంగాధర్‌కు ఏడు రోజుల జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధిస్తూ ఫస్ట్ స్పెషల్ జుడిషియల్ సెకండ్ క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్ మంగళగారి తీర్పునిచ్చారు. సీఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. గోటూరు గంగాధర్ మద్యం తాగి మోటారు సైకిల్ నడుపుతూ వెళ్తుండగా.. కడప తాలూకా పోలీసులు బ్రీత్ అనలైజర్‌తో తనిఖీలు చేశారు. మద్యం తాగినట్లు తెలియడంతో సెక్షన్ 185 ఎం.వీ.యాక్ట్ క్రింద కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

గుండె పోటుతో కూలీ మృతి

వల్లూరు : మండలంలోని పెద్దపుత్త గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ పైడి కాలువ పెద్ద గంగులయ్య(68) శుక్రవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎంపీడీవో జయశ్రీ, ఏపీవో సుధారాణి పెద్దపుత్తలోని మృతుడి ఇంటి వద్దకు వెళ్లి వివరాలు ఆరా తీశారు.

అంగన్వాడీ వర్కర్లకు రాజకీయ వేధింపులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో పని చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని అంగన్‌వాడీల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.లక్ష్మీదేవి, ఆర్ లక్ష్మీదేవి, అంజనీదేవి డిమాండ్ చేశారు. సింహాద్రిపురం, కమలాపురం, కొండాపురం, ముద్దనూరు, వేంపల్లి, వేముల, తదితర మండలాల్లో అంగన్వాడీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు ఎవరిపై కక్ష సాధింపులు చేయకూడదని ప్రకటించినా, ఆయన మాటలు నాయకులు గౌరవించకపోవడం బాధాకరమని తెలిపారు. కొన్ని సెంటర్లలో తాళాలు వేసి వెళ్లమని చెప్పడం దారుణమన్నారు. వేధింపులు కొనసాగితే ఆందోళనచేస్తామని హెచ్చరించారు.

నవంబరులో అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్

వైవీయూ : కడప నగరంలో ఈ ఏడాది నవంబరులో నిర్వహిస్తున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని ఎన్‌సీసీ కేడెట్స్ సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ మేజర్ అమర్‌దీప్ సూచించారు. నగరంలోని తెలుగుగంగ కాలనీలోని ఏడో కంబైన్డ్ యాన్యువల్ ట్రెనింగ్ క్యాంప్‌లో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేజర్ అమర్‌దీప్ మాట్లాడుతూ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఎన్‌డీఏ, ఐఎంఏ, అగ్నివీర్ విభాగాల్లో ఎంపికలకు నిర్వహించే ఫిజికల్ టెస్టులు, రాత పరీక్షలపై కేడెట్స్ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ కిషన్‌దత్, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ పసుపుల రాజశేఖర్, సీటీఓలు పవన్‌కుమార్, సురేంద్రనాయక్, హైదర్, పరేడ్ శిక్షకులు సుబేదార్ మేజర్ అనిల్‌కుమార్, సీఎల్.రెడ్డి, కొండారెడ్డి, సందీప్ సింగ్, బస్ నెట్, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.